క్లుప్తంగా

దుకాణాల ఏర్పాటుకు 15న వేలం

కదిరి టౌన్: మార్చి 2 నుంచి 16 వరకు జరిగే శ్రీఖాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని ఆలయం చుట్టూ ఉన్న దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 15వ తేదిన మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3 లక్షల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

రోగులకు వైద్య సేవలు

అమడగూరు: మండలంలోని పూలకుంటపల్లిలో గురువారం కదిరి సిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ శకుంతలమ్మ పర్యవేక్షణలో స్థానిక వైద్యాధికారిణి అపర్ణ 250 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత, జనరల్ చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలకు కదిరి విద్యార్థి ఎంపిక



మహ్మద్‌సోనును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా. స్మిత

కదిరి అర్బన్: దక్షిణ భారతదేశ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఎస్కేయూ జట్టుకు కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం మొదటి సంవత్సరం విద్యార్థి మహ్మద్ సోను ఎంపికయ్యాడు. బెంగళూరులోని రేవా యూనివర్సిటీలో ఈ నెల 20వ నుంచి మార్చి 3 వరకు పోటీలు జరుగుతాయి. కాగా మహ్మద్ సోనును ప్రిన్సిపాల్ డా.స్మిత, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, పీడీ నరసింహాచారి గురువారం అభినందించారు.

గదుల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి

నల్లచెరువు: మండల పరిధిలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వివాహ, శుభకార్యాలకు అనుగుణంగా 10 అదనపు గదుల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 4 గదులను నిర్మించడానికి కదిరి చెందిన నాగూరి రామచంద్రారెడ్డి, పి కొత్తపల్లి గోవిందు దామోదర్‌రెడ్డి, పాళ్యం సుధాకర్ ముందుకొచ్చారన్నారు. మిగిలిన 6 గదుల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

కనగానపల్లి: తగరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు చేస్తున్న ఆధార్ నమోదును ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి 10 సంవత్సరాలకోసారి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు.

కుష్టు లక్షణాలపై అవగాహన

నల్లమాడ: వైద్య చికిత్సలతో కుష్టును నివారించవచ్చని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ రామాంజులు అన్నారు. కుష్టు వ్యాధిపై మండలంలోని వేళ్లమద్ది గ్రామ సచివాలయంలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీహెచ్ఓ రామాంజులు మాట్లాడుతూ రాగి రంగులో స్పర్శ లేకుండా ఉండే మచ్చలను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే కుష్టు వ్యాధిని, నివారించవచ్చన్నారు. సర్పంచ్ బొజ్జేనాయక్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఏర్పాటుకు గ్రామసభ



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలం చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంతో ముంపునకు గురైన పెద్ద చిగుళ్లరేవు గ్రామాన్ని గ్రామస్తులు సమీపంలోనే పునర్ నిర్మించారు. అయితే ఇక్కడ నివాసం ఉంటున్న వారికి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలంటే నూతన గ్రామాన్ని గ్రామ పంచాయతీగా గుర్తించాలి. ఈనేపథ్యంలో పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గురువారం గ్రామసభను ఏర్పాటు చేసి పెద్ద చిగుళ్ల రేవు గ్రామ పంచాయతీ ఏర్పాటుకు తీర్మానం చేశారు. గ్రామసభలో ఎంపీపీ ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, పరంధామరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

టైల్స్ షాపుపై దాడి

ధర్మవరం అర్బన్: స్థానిక గాంధీనగర్‌లో ఉన్న టైల్స్ షాపుపై గురువారం ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు లక్ష్మీనాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న అశోక్‌కు లక్ష్మీనాయక్ రూ.23వేలు బాకీ ఉన్నాడు. నగదుకు బదులుగా టైల్స్ బాక్సులు తీసుకెళ్లాలని లక్ష్మీనాయక్ సూచించాడు. అయితే అశోక్, తన మనుషులతో వచ్చి టైల్స్‌తోపాటు కౌంటర్‌ను బద్దలుగొట్టి 300 టైల్స్ బాక్సులు ఎత్తుకెళ్లాడు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు

జగనన్నకే నా ఓటు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు మారేపల్లి సాలెమ్మ. ఓడీ చెరువు మండల కేంద్రంలో నివాసం ఉంటోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాలెమ్మ కుటుంబానికి మూడున్నర సంవత్సరాల్లో వివిధ పథకాల ద్వారా రూ. 2,72,501 మేర లబ్ధి జరిగింది. జగనన్న అమ్మఒడి ద్వారా రూ.29 వేలు, విద్యా దీవెన ద్వారా రూ. 12,343, జగనన్న వసతి దీవెన కింద రూ. 11,580, వైఎస్సార్ ఆసరా కింద రూ. 13,590, వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ. 6,988తో పాటు జగనన్న లేఔట్‌లో ఇంటి నిర్మాణానికి రూ. 2 లక్షల విలువైన స్థలం మంజూరైంది. జగనన్న పేదల జీవితాల్లో వెలుగులు నింపారని, వచ్చే ఎన్నికల్లో తన ఓటు ఆయనకే వేస్తానని సాలెమ్మ పేర్కొంది.



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- జీవితాంతం రుణపడి ఉంటాం
- స్పష్టం చేసిన గ్రామీణులు
- జగనన్నను ఆశీర్వదించండి
- 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఓడీ చెరువు: పేదల బతుకుల్లో జగనన్న వెలుగులు నింపారు. మాకు ఎన్నో పథకాలు అందించారు. వచ్చే ఎన్నికల్లో మా ఓటు జగనన్నకే వేస్తాం.. అని ఓడీ చెరువు గ్రామ సచివాలయం–1 పరిధిలోని పాత మసీదు కాలనీ, సత్యమ్మ కాలనీ, పాతపోస్టాఫీసు కాలనీ ప్రజలు స్పష్టం చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గురువారం ఉదయం ఆయా కాలనీలకు వెళ్లగా జగనన్న పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నర సంవత్సరాలుగా సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డ్రైనేజీ, సీసీ రోడ్డు వేయాలని కాలనీ వాసులు విన్నవించారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగనన్నను ఆశీర్వదించి మరో మారు ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఎంపీడీఓ పోలప్ప, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీపీ ఫర్వీన్‌బాను, జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, సర్పంచు గోవిందు, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దీపికారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రామసురారెడ్డి, ఎంపీటీసీ రజిత, నాయకులు వెంకటేసు, తుమ్మల బాబా, బాబ్‌జాన్, మండోజీ ఆరీఫ్‌ఖాన్, జౌలి బాబా, నరసింహారెడ్డి, జబీవుల్లా, ఫిరోజ్ పాల్గొన్నారు.

జంప్ రోప్ పోటీల్లో కాంస్య పతకం



విద్యార్థి సుదీప్

నల్లమాడ: మహారాష్ట్రలోని షిరిడీలో ఈనెల 1 నుంచి 6 వరకు జరిగిన జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో నల్లమాడ మండల కేంద్రంలోని పాత బాలాజీ ఆంగ్ల మీడియం ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థి ఏ.సుదీప్ ఉత్తమప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించాడు. సదరు విద్యార్థిని పాఠశాల స్కూల్ డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి, కరస్పాండెంట్ పోలే స్వర్ణలత గురువారం అభినందించారు.

నేడు సచివాలయ కన్వీనర్లకు శిక్షణ

రాప్తాడు: మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శుక్రవారం ఉదయం 10 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు దిశా, నిర్దేశం చేస్తారన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు అందుబాటులో ఇసుక



లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేస్తున్న హౌసింగ్ అధికారులు

కనగానపల్లి: మండలంలో హౌసింగ్ లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా మూడు ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు హౌసింగ్ ఏఈ చిరంజీవి తెలిపారు. మండలంలోని మామిళ్లపల్లిలో స్టాక్ పాయింట్ నుంచి గురువారం హౌసింగ్ లబ్ధిదారులకు ఇసుక సరఫరాను ప్రారంభించారు. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద మండలంలో సుమారు 2,500 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని ఏఈ తెలిపారు. వీటి నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేస్తోందన్నారు. అయితే సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇసుకను తెచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులతో పాటు మండల ప్రజాప్రతినిధుల కోరిక మేరకు కనగానపల్లి, మామిళ్లపల్లి, వేపకుంట గ్రామాల్లో ఇసుక పాయింట్లు ఏర్పాటు చేయించామన్నారు. మొత్తం 6 వేల టన్నుల ఇసుక నిల్వ చేసి, చుట్టు పక్కల గ్రామాల్లోని లబ్ధిదారులకు ఇక్కడ నుంచే ఇసుక సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ షకీలా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించండి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని గృహసారథులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు పట్టణంలోని మార్కెట్‌యార్డులో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాలు ప్రజలకు ఏం చేశాయో? ప్రస్తుత సీఎం జగనన్న ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారో ఆధారాలతో సహా ప్రజలకు వివరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. 2014లో అపద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీ నెరవేర్చకపోగా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ మూడేళ్లలోనే నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా దోచుకుతిన్నారని విమర్శించారు. సీఎం జగనన్న సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమఫలాలు అందజేస్తున్నారన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

- పొలంబడి కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సత్యనారాయణ

గాండ్లపెంట: పంట సాగు సమయంలో విత్తనశుద్ధి చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కదిరి వ్యవసాయశాఖ ఉప సంచాలకులు సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీ సామచేనుబైలు రైతు భరోసా కేంద్రం పరిధిలోని బనాన్‌చెరువుపల్లిలో రైతు భాస్కరరెడ్డి పొలంలో గురువారం 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ సమగ్ర యాజమాన్య పద్ధతులు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయం, నాణ్యమైన దిగుబడి అంశాలపై రైతులకు వివరించారు. భూసార పరీక్షలు, శత్రు, మిత్రపురుగులు గుర్తించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. సాగు ఖర్చులు తగ్గించుకోడానికి, నాణ్యమైన అధిక ఉత్పత్తులను సాధించేందుకు పొలంబడి తోడ్పడుతుందన్నారు. ఏఓ లక్ష్మీప్రియ, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ యుగేశ్వరిదేవిని సన్మానిస్తున్న మహాబోధి సాహిత్య వేదిక సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉత్తమ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణిగా అవార్డు అందుకున్న తహసీల్దార్ యుగేశ్వరిని మహాబోధి సాహిత్య వేదిక ఘనంగా సన్మానించింది. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆ వేదిక వ్యవస్థాపకులు దాసన్నగారి కృష్ణమూర్తి, ఎస్కే తెలుగు విభాగాధిపతి బాలసుబ్రహ్మణ్యం, స్నేహక్లబ్ జిల్లా గవర్నర్ రామంజినేయులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మార్కెటింగ్ ఉద్యోగి సోమశేఖర్‌రాజు తహసీల్దార్ యుగేశ్వరిదేవిని శాలువాలతో సత్కరించారు.

మండెంవారిపల్లి రహదారి తళతళ



మండెంవారిపల్లికి నిర్మించిన తారు రోడ్డు

ఎన్‌పీకుంట: టీడీపీ హయాంలో పల్లె రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. రాళ్లు, రప్పలతో నిండిన రోడ్లలో రాకపోకలు సాగిస్తూ గ్రామీణులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పల్లె రోడ్లు అభివృద్ధికి నోచుకుంటున్నాయి. అందులో భాగంగానే మండలంలోని మండెంవారిపల్లికి రోడ్డును నిర్మించారు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డికి గ్రామస్తులు రోడ్డు దుస్థితిని వివరించారు. కనీసం 108, 104 వాహనాలు కూడా రాని పరిస్థితి నెలకొందని వాపోయారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు ఏపీఆర్ఆర్‌పీ(ఈఏపీ) కింద రూ.1.37 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేయగా కదిరి–రాయచోటి ఆర్‌కె రోడ్డు నుంచి వయా మండెంవారిపల్లి మీదుగా పల్లెనాయునివారిపల్లి వరకు 2.35 కి.మీ తారు రోడ్డు వేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హామీ నెరవేర్చారు



గతంలో ఎంతో మంది రాజకీయ నాయకులు గ్రామానికి వచ్చినప్పుడు హామీలు ఇచ్చి ఆ తర్వాత విస్మరించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాత్రం ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మించారు. నిధులు విడుదల చేసిన సీఎం జగనన్నకు, రోడ్డు వేయించిన ఎమ్మెల్యే సిద్దారెడ్డికి రుణపడి ఉంటాం.

కె.భాస్కర్‌నాయుడు, మండెంవారిపల్లి

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూ విరాళం

- దాతను అభినందించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఏఈకి అందజేస్తున్న దాత యర్రమనేని సుధాకర్

ఓడీ చెరువు: మండలంలోని టీ.కుంట్లపల్లిలో 11/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు బసప్పగారిపల్లికి చెందిన యర్రమనేని సుధాకర్ 84 సెంట్ల భూమిని విరాళంగా అందజేశారు. ఈమేరకు రిజిస్ట్రేషన్ పత్రాలను గురువారం ఓడీ చెరువులో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ట్రాన్స్‌కో ఏఈ రామసురారెడ్డికి సుధాకర్ అందజేశారు. ఈ సందర్భంగా దాత సుధాకర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని లక్షల విలువైన భూమిని విరాళంగా ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎంపీపీ ఫర్వీన్ బాను, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు మధుసూదన్ నాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ఎనుములపల్లిలోని శివాలయంలో క్రేన్ ద్వారా ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ ఎనుములపల్లి గ్రామంలో రూ.కోటితో నిర్మించిన శివాలయంలో గురువారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. కర్నూలు జిల్లా నంద్యాల నుంచి విగ్రహాలు, ధ్వజస్తంభం తెప్పించి పురోహితులు నాగరాజశర్మ అధ్వర్యంలో జ్యోతిప్రజ్వలన, మహాగణపతిపూజ, కలశపూజల అనంతరం క్రేన్ సహాయంతో ధ్వజస్తంభ ప్రతిష్టను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామ పెద్దలు హాజరయ్యారు.



ధర్మవరంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్‌లో నూతనంగా నిర్మించిన శీతలాదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీక్ష హోమాలు, వేద పారాయణం, వేదమంత్రాల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్టాపన జరిగింది. 12వ తేదిన విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సాకే చిన్నక్రిష్ణ, బెస్త రామక్రిష్ణ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి

ముదిగుబ్బ: ప్రతి పేద కుటుంబానికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బీడుమర్రి, బీడుమర్రి కొట్టాలలో గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఎంపీపీ ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇందుకూరి నారాయణరెడ్డి, మర్తాడు సర్పంచ్ శివారెడ్డి, ఎంపీటీసీ నారాయణ పాల్గొన్నారు.

చకచకా రోడ్డు పనులు



కొండపైకి వెళ్లే మార్గాన్ని చదును చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి సమీపంలోని కొండపై వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయం వరకు చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ స్వామి దర్శనానికి ప్రతి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. అయితే రోడ్డు రాళ్లు, రప్పలతో నిండి ఉండటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీంతో తంగెం వంశీయులైన పూజారులు విరాళాలు సేకరించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. చంద్రాయునిపల్లి గ్రామానికి చెందిన కొంత మంది రైతులు రోడ్డు ఏర్పాటుకు అవసరమైన భూమిని ఉచితంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారని, మరి కొందరు నగదు రూపంలో విరాళాలు అందించారని పూజారులు తంగెం ఆంజనేయులు, ఆదినారాయణ తెలిపారు. శనివారం ఆలయంలో తడక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి





వినాయకుడికి అలంకరణ, పూజల్లో పాల్గొన్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గాంధీనగర్ శివాలయంలో వినాయకునికి, షిరిడీ సాయిబాబా ఆలయంలోని వినాయకునికి గురువారం రాత్రి సంకష్టహర చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు మహిళలు ఉపవాసాలు ఉంటూ వినాయకునికి పూజలు చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

గాండ్లపెంట: ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు మహేశ్వరమారుతి, బాబా ఫకృద్దీన్‌లు గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. 41 మంది గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోగా వీరిలో 25 మంది హైరిస్కు ఉన్నట్లు గుర్తించారు. పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, మందుల వినియోగంపై అవగాహన కల్పించారు.

17న మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన సర్వసభ్య సమావేశంపై మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపారు.